ఇళ్లు శిథిలం..
బతుకు భయం భయం

పాతనగరానికి ఎంతో చారిత్రక ప్రాశస్త్యం ఉంది. బ్రిటిష్ కాలం నుంచి ఈ ప్రాంతం చైతన్యవంతంగా ఉంది. ఇక్కడ ఎన్నో కట్టడాలకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. విశాఖకు సంబంధించినంత వరకు ఇదే తొలి నగరం. అందుకే దీన్ని ఓల్డ్‌టౌన్ అని కూడా అంటారు. అయితే ఇప్పుడు ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారు చాలా మంది బిక్కుబిక్కుమంటూ రోజులీడుస్తున్నారు. దీనికి కారణం.. పాతనగరంలోని చాలా పురాతన భవనాలు ఎప్పుడు కూలుతాయో అన్నట్లు ఉండటమే. మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఈ శిథిల భవనాల్లో నివసిస్తున్న వారు భయాందోళనలకు లోనవుతున్నారు.

- పాతనగరంలో ఎప్పుడు ఏ బిల్డింగ్ కూలుతుందో తెలియని పరిస్థితి
- వర్షాలకు తడిసి ముద్దయిన ఓల్డ్‌టౌన్


పాతనగరంలోని రాజప్పనాయుడు వీధిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు


పాతనగరంలోని గాంధీ బొమ్మ ఏరియాలో శిథిలమైన ఇల్లు

దాబాగార్డెన్స్ : పాతనగరవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే భయం గుప్పిట్లో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇక్కడున్న పలు పాత ఇళ్లు తడిసి ముద్దయ్యాయి. ఎప్పుడు కూలుతాయోనన్న భయంతో ప్రజలున్నారు. పలువురు ఇంటి యజమానులు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను కూల్చకుండా ఉంచేయడంతో ఆ ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారు ప్రమాదపుటంచుల్లో భయాందోళనలో ఉన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదంటూ అధికారులే చెబుతున్నారు.

స్పందించని ఇంటి యజమానులు..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వానలకు దక్షిణ నియోజకవర్గంలోని పాతనగరంలో ఏళ్ల నాటి ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాంటి కొన్ని ఇళ్లల్లో ఎవరూ లేకపోయినా కొంత మంది అభాగ్యులు ఆ ఇళ్లలో తలదాచుకుంటున్నారు. మరి కొన్ని ఇళ్లలో అద్దెకున్న వారు ఖాళీ చేయకపోవడం, ఇంటి యజమానులు కూడా పట్టీ.. పట్టనట్టు ఉండటంతో అవి అలాగే ఉండిపోయాయి. సాక్షాత్తు జీవీఎంసీ యంత్రాంగం శిథిలావస్థకు చేరుకున్న ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ పలువురు స్పందించలేదు.

శిథిల గృహాలు కోకొల్లలు..

విశాఖ పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు ఎన్నో ఉన్నాయి. వాటిలో స్కీం ఇళ్లతో పాటు వాంబే గృహాలు కూడా ఉన్నాయి. అవి శిథిలమై పెచ్చులూడుతున్న సందర్భాలున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా అందులో ఉన్న వారు బిక్కుబిక్కుమంటున్నారు. ముఖ్యంగా పాతనగరంలోని కోటవీధి, పాతపోస్టాఫీస్, అంబుసరంగు వీధి, చాగంటివారి వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లివీధి, చిలకపేట, పద్మానగర్, తారకరామకాలనీ తదితర ప్రాంతాల్లో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.


మట్టా వెంకటప్పయ్య వీధిలో పాడుబడిన ఇల్లు


పాగనగరంలోని పురాతన గృహం

నోటీసులు జారీ చేసినా..

పాతనగరంలో శిథిలావస్థకు చేరుకున్న పలు పాత భవనాలకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో కొందరు ముందుకొచ్చి పాత భవనాలు నేలమట్టం చేస్తున్నారు. మరికొంత మంది యజమానులు స్పందించకుండా భీష్మించుకుంటున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు సంబంధించి యజమానులకు నోటీసులిచ్చి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. స్పందించకపోతే కూల్చేందుకు జీవీఎంసీ సిద్ధంగా ఉంది.

– ఝాన్సీలక్ష్మి, అసిస్టెంట్ పట్టణ ప్రణాళిక అధికారి, జీవీఎంసీ

అన్ని వర్గాలను అలరించనున్న 'కంచర్ల'

దాబాగార్డెన్స్ : తమ ఇంటి పేరైన కంచర్ల టైటిల్‌తో ప్రతిష్టాత్మకంగా చిత్రం నిర్మిస్తున్నామని ప్రొడ్యూసర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ఆగస్టులో విడుదలయ్యే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుందన్నారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. షూటింగ్ పూర్తయిందని, ఈ చిత్రం ద్వారా వచ్చే లాభాలతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. హీరోగా ఉపేంద్ర, హీరోయిన్‌గా మీనాక్షి, ప్రణతి అద్భుతంగా నటించారన్నారు. హీరో ఉపేంద్ర మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ క్రియేషన్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నంబర్-2గా కంచర్ల చిత్రం చేస్తున్నామని చెప్పారు. కంచర్ల టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం గొప్ప విజయం సాధిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో డైరెక్టర్ యాద్‌కుమార్, కో డైరెక్టర్ త్రినాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ వినోదరాణి, ప్రొడక్షన్ మేనేజర్ శేఖర్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. దేవస్థానం మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష అభిషేకాలు చేశారు.

'గిరి' భక్తులకు ఉచితంగా మందుల పంపిణీ


భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమణమూర్తి, కళావతి

సీతమ్మధార : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా సీతమ్మధారలో కళా ఆస్పత్రి ఆధ్వర్యంలో సంస్థ అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి, ఆయన సతీమణి డాక్టర్ కళావతి భక్తులకు ఉచితంగా బీపీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వంశీ


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం క్లాత్ బ్యాగ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వివేకానంద సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జనప్రియ అధినేత వేణుగోపాల్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, 39వ వార్డు కార్పొరేటర్ సాదిక్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముందుకొచ్చిన సముద్రం


సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద ఇలా..

ఆరిలోవ: తుపాను ప్రభావంతో సముద్ర కెరటాలు ఎగసిపడుతున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సముద్రం నీరు తీరంలో మరింత ముందుకొచ్చింది. జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద సముద్రం నీరు గతంలో కంటే ముందుకు చేరింది. ఒడ్డున విశాలమైన ఇసుక దిబ్బలు సగానికి పైగా మునిగిపోయాయి. సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద రాళ్లకు కొంత దూరంలో ఉండే నీరు ఇప్పుడు వాటిని దాటి ముందుకు వచ్చింది. దీంతో బీచ్ లోపలకు సందర్శకులు ఎవరూ వెళ్లే సాహసం చేయకుండా రోడ్డు మీద నుంచే కెరటాలను తిలకిస్తున్నారు.

కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


వన్‌టౌన్‌లోని కాలువలను శుభ్రం చేయిస్తున్న జెడ్సీ, ఏఎంహెచ్‌వో

జగదాంబ : వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న కాలువలను జెడ్సీ ప్రసాదరావు, ఏఎంహెచ్‌వో రాజేష్ పరిశుభ్రం చేయించారు. వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఇక్కడి ప్రధాన రహదారి జలమయం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జెడ్సీ, ఏఎంహెచ్‌వో శనివారం ఉదయం పందుపుల్లల సందు వద్ద ఉన్న పది అడుగుల కాలువలో అడ్డుపడిన వ్యర్థాలను సిబ్బందితో తొలగింపజేశారు. దీనిలో సుమారు అర టన్ను ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు ఉండడంతో మురుగు నీరు సాఫీగా పారక రహదారి పైకి చేరింది. దీని వల్ల మ్యాన్‌హోల్‌తో పాటు చిన్న కాలువలు కూడా పొంగి ప్రవహించినట్లు అధికారులు తెలిపారు. కేజీహెచ్ పైనుంచి ఈ కాలువ ప్రవహిస్తుందని, ఆస్పత్రి వ్యర్థాలు కాలువలో వేస్తున్నారని అన్నారు. దీన్ని సిబ్బందితో ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు జెడ్సీ, ఏఎంహెచ్‌వో తెలిపారు.

గురుపౌర్ణమికి ఆలయాలు ముస్తాబు


గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైన అచ్చియ్యమ్మపేట షిర్డీ సాయి ధ్యాన మందిరం

అల్లిపురం : ఆషాఢ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలో పలు ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. 34వ వార్డులోని అచ్చియ్యమ్మపేట, శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రతినిధి ఉమ్మిడి నాగరాజు తెలిపారు. అదే విధంగా బంగారుమెట్ట సాయిబాబా దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయిబాబావీధి సాయిబాబా దేవాలయం, మూడుగుళ్ల జంక్షన్‌లో గల సాయిబాబా ఆలయం, టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, అమ్మవారివీధి కొత్తమ్మవారి దేవాలయంలోని సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

శాకంబరిగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు..

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు శాకంబరిగా ఆదివారం దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో జీవీ రమాబాయి తెలిపారు.

మార్కెట్‌లో కలెక్షన్ కింగ్‌లు

- పూర్ణామార్కెట్.. రామకృష్ణా రైతుబజార్ ఆశీలు వసూళ్లలో ఉద్యోగుల చేతివాటం
- పంపకాల్లో తేడా వచ్చేసరికి బయటపడుతున్న నిజాలు
- రెల్లివీధి మార్కెట్‌కు రెండేళ్లుగా వేయని వేలం.. కనబడని లెక్కలు
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు


పూర్ణామార్కెట్

జగదాంబ : జీవీఎంసీ జోన్-4లో తీగలాగితే డొంక కదులుతోంది. నాలుగు నెలలుగా జీవీఎంసీ జోన్-4లో పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతుబజార్‌లో డిపార్ట్‌మెంట్ కలెక్షన్లకు సంబంధించి 'సాక్షి'లో 'మార్కెట్‌లో మతలబు' శీర్షికన కథనం వెలువడడంతో అవకతవకలకు పాల్పడుతున్న సిబ్బందిలో గుబులు మొదలయింది. పూర్ణామార్కెట్‌లో రోజువారి వసూళ్లు రూ. పది వేలు అంత కంటే తక్కువ చూపిస్తూ మిగిలిన సొమ్మును కొందరు పంపకాలు చేసుకుంటున్నారని సమాచారం. రెవెన్యూ ఉద్యోగి వారానికి ఒకసారి ఆశీలు వసూలు చేస్తున్న సెక్రటరీల వద్ద సొమ్ము తీసుకుని జీవీఎంసీ సౌకర్యం సెంటర్‌కు చెల్లిస్తారని తెలిసింది. వాస్తవంగా అయితే డిపార్ట్‌మెంట్ కలెక్షన్లు ఉద్యోగులు తమ వద్ద ఉంచుకోకుండా ఏ రోజుది ఆరోజే చెల్లించాలి. ఒకవేళ ఆదివారం అయినా, సెలవు వచ్చినా, ఆశీలు వసూలు అయ్యేసరికి రాత్రి అయిపోతే వసూలు చేసిన సొమ్మును మర్నాడు చెల్లించాలి. కానీ వారం రోజులు ఉద్యోగి వద్ద ఎందుకు ఉంచుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే రామకృష్ణా రైతుబజార్‌కు సంబంధించి రోజుకు రూ. 4 వేల కంటే తక్కువ మొత్తం ఆశీలు వసూలైనట్లు చూపిస్తున్నారని తెలిసింది. ఇందులో కూడా కార్యాలయంలోని ఓ ఉద్యోగికి రూ. 3 వేలు ఇవ్వాలన్న ఆదేశాలు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే రెండు సంవత్సరాలుగా రెల్లివీధి మార్కెట్‌కు ఆక్షన్ నిర్వహించకుండా వసూలు చేస్తున్న ఆశీలు సొమ్ముకు లెక్కలు లేవని వినికిడి. అంతే కాకుండా కల్యాణ మండపాలు, దుకాణ సముదాయాల వంటి అన్ని చోట్ల ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారని విశ్వసనీయ సమాచారం.

సెక్రటరీలపై జులుం...

అన్నెంపున్నెం ఎరుగని సెక్రటరీలపై జీవీఎంసీ అధికారులు జులుం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి సెక్రటరీలు, అడ్మిన్లు వారి ఉద్యోగాలు వారిని చేసుకోనివ్వకుండా ఆశీలు వసూలుకు పంపించడమే కాకుండా వారిని బెదిరిస్తున్నట్లు జోరుగా వినిపిస్తోంది. 'సాక్షి'లో వచ్చిన కథనాల నేపథ్యంలో సెక్రటరీలను వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, ఈ వ్యవహారాలన్నింటిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తే మరిన్ని విషయాలు బయటికి వస్తాయని పలువురు చెబుతున్నారు.

జనతాబజార్‌లో అక్రమ వసూళ్లు..

జీవీఎంసీ జనతాబజార్ 72 దుకాణాల సముదాయం. ఇది నేడో రేపో కూలియే స్థితిలో ఉంది. ఇందులో దుకాణాలకు ఆక్షన్లు పెట్టడం మానేశారు. అద్దెలు కూడా తీసుకోవడం లేదని తెలుస్తోంది. అయినా రెవెన్యూ ఉద్యోగి దుకాణాల వద్ద నుంచి నెలనెలా డబ్బులు వసూలు చేసుకుని జేబులో వేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనతాబజార్‌లోని ఓ స్క్రాప్ దుకాణ యాజమానికి ఇక్కడ ఒక్క దుకాణమే ఉంది. కానీ రెండు దుకాణాలు ఆక్రమించుకుని వ్యాపారం చేసుకుంటున్నాడని.. అంతే కాకుండా ఓ మెకానిక్‌కు నెలకు రూ. పదివేలకు ఒక దుకాణం అద్దెకి ఇచ్చినట్లు సమాచారం. ఇదంతా రెవెన్యూ ఉద్యోగి అండదండలతో జరుగుతుందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

వందల కొద్దీ ఫిర్యాలు వచ్చినా..

మార్కెట్ ఆశీలుకు సంబంధించి జోనల్ కమిషనర్‌కు రెండు వందలకు పైగా ఫిర్యాదులు వచ్చినా ఆయన ఎందుకు స్పందించలేదో అర్థం కావడం లేదని కొందరు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. చర్యల సంగతి తర్వాత అసలు ముందు విచారించాలి కదా అని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మెమోలు ఇచ్చాం..

ఆశీలు వసూలు విషయంలో రెవెన్యూ సిబ్బందికి మెమోలు ఇచ్చాం. ఆశీలు డబ్బులు ఎవరి వద్ద ఉంచకుండా ఏ రోజుకు ఆ రోజు వసూలు చేసిన సొమ్మును చెల్లించేయాలి. దీనికి ముందు జెడ్సీకి పూర్తి వివరాలతో తెలియపరచాలి. తర్వాత సౌకర్యం సెంటర్‌లో చెల్లించాలని ఆదేశాలు జారీ చేశాం. సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరుపుతాం. నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

– ప్రసాదరావు, జోనల్ కమిషనర్, జోన్-4, సూర్యాబాగ్

మత్స్యకార సమస్యల పరిష్కారానికి వినతి


మంత్రి అచ్చెంనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న జానకీరామ్ తదితరులు

మహారాణిపేట : పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టెక్కలిలో రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు స్వగృహంలో ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో శనివారం బోటు యజమానులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. వీటిలో ప్రధానంగా బకాయి పడ్డ డీజిల్ సబ్సిడీ రూ. 2 కోట్ల 77 లక్షలు విడుదల చేయాలని కోరారు. వివిధ ప్రమాదాల వల్ల నష్టపోయిన సుమారు 15 మంది ఫిషింగ్ బోటు యజమానులకు నష్టపరిహారం అందజేయాలని, 2023-24 సంవత్సరానికి గాను మత్స్యకార భరోసా అందించాలని, సాంకేతిక కారణాలు చూపిస్తూ అనర్హులుగా ప్రకటించిన సుమారు 2 వేల మంది అర్హులైన వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చి వారికి కూడా భరోసా అందజేయాలని కోరారు. ఈ సమస్యలపై మంత్రి స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారని జానకిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుంటు దానయ్య, దూడ పోలయ్య, ఎల్. రవి, వై. శ్రీను, వాసుపల్లి బ్రహ్మారాజు, ఆకుల అజార్, సూరాడ అనిల్, చీడిపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


తుంగ్లాంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సిబ్బంది సూచించారు. సీజనల్ వ్యాధులపై 69వ వార్డు రెడ్డితుంగ్లాంలోని వేమన మందిరం వద్ద స్థానికులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం, మలేరియా సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఆర్‌జీబీ క్యాంపెయిన్‌లో భాగంగా తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను అరికట్టడంతో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఈ విషయంలో సహకరించాలని కోరారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తికి కారణమైన వాటిని గుర్తించి తొలగించాలని తెలిపారు. దోమతెరలను, దోమల నివారణా కారకాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.అప్పలరాజు, ఆర్‌పీ అంజలి, సచివాలయం హెల్త్ సెక్రటరీ వరలక్ష్మి, ఎస్.నాగేశ్వరరావు, జయరాజు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తుల సేవలో.. స్వచ్ఛంద సంస్థలు


అడవివరంలో భక్తులకు పులిహోర అందజేస్తున్న భూలోక యూత్ ఫ్రెండ్స్

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులకు దారి పొడవునా పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలతో పాటు పలు కుటుంబాల వారు తరించారు. తమకు తోచిన రీతిలో వితరణ చేపట్టారు. పరోక్షంగా అప్పన్న సేవలో మునిగారు. ఆహార పదార్థాలు, పానీయాలు, ప్రసాదం, టిఫిన్స్, చాక్లెట్లు, టీ, బిస్కెట్లు విరివిగా అందజేశారు. అడవివరం, పాత అడవివరం నుంచి పైనాపిల్ కాలనీకి వెళ్లే మార్గంలో పెద్ద ఎత్తున భక్తులకు సేవలందించారు.

- పాత గోశాల వద్ద ఎస్ఎస్ఆర్ కల్యాణమండపం అధినేత బి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బోండా, పొంగలి నిర్విరామంగా అందజేశారు.
- హైదరాబాద్‌కి చెందిన కందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు అల్పాహారం పంపిణీ చేశారు. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా 100 వంట బృందాన్ని తీసుకొచ్చారు.
- గురురాజ సంపత్ వినాయక ఏజెన్సీస్ ఆధ్వర్యంలో పులిహోర, బిర్యానీ, శనగలు, ఉప్మా, స్వీట్లు అందజేశారు.
- అడవిరం ప్రధాన రహదారి వద్ద భూలోక యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్ర వరహా నరసింహం, యర్ర మణిదీప్, శిడగం రామకృష్ణ, శిడగం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.
- అడవివరంలోని ఎంపీపీ స్కూల్ వద్ద అడవివరం నివాసితులు ఫణిమనోహర్, సతివాడ శంకర్రావు, బున్ని ఆధ్వర్యంలో పులిహోర, గ్లూకోస్ అందజేశారు.
- ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో పులిహోర, సత్యనారాయణస్వామి ప్రసాదం, చక్కెర పొంగళి, శనగలు పంపిణీ చేశారు.
- మేజర్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పులిహోర అందజేశారు.
- నగరంలోని శ్రీహరిపురానికి చెందిన శ్రీలక్ష్మి క్రేన్స్ ఆధ్వర్యంలో బిర్యానీ, సత్యనారాయణ స్వామి ప్రసాదం అందజేశారు.

24న 'లైమ్‌లైట్స్' అవార్డుల ప్రదానం


వివరాలు వెల్లడిస్తున్న ఈమా సభ్యులు

తాటిచెట్లపాలెం: ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ (ఈమా) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మధురవాడలోని వీ కన్వెన్షన్స్‌లో లైమ్‌లైట్స్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఈమా అధ్యక్ష, కార్యదర్శులు సందీప్‌కుమార్, షరీఫ్‌ఖాన్ తెలిపారు. నరసింహనగర్‌లోని తమైరా బ్యూటీ క్లినిక్‌లో శనివారం మీడియా సమావేశంలో వీరు వివరాలు వెల్లడించారు. ప్రతిభావంతులైన ఈవెంట్ మేనేజర్లు, కళాకారులు, ఈవెంట్ రంగంలోని విభిన్న విభాగాల్లో పనిచేసే వారికి సుమారు 20 కేటగిరీల్లో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఎంట్రీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈవెంట్ ప్రధాన స్పాన్సర్ తమైరా స్కిన్ అండ్ బ్యూటీ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.జ్యోతిస్వరూప మాట్లాడుతూ ఈమా అవార్డుల వేడుకల్లో తాము భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో ఈమా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.ఎస్.రాజు, జాయింట్ సెక్రటరీ సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యుడు జగదీష్, ఆషా పట్నాయక్ పాల్గొన్నారు.